# బాధ్యత

అన్నీ అవసరాలే... ఆలోచన సాగుతున్న రాముకి అకస్మాత్తుగా భార్య గుర్తొచ్చింది. ఇంటి ఇబ్బందులు, డబ్బు గొడవలు తప్ప భార్యతో సరదాగా మాట్లాడి ఎన్నాళ్ళయిందో. తామిద్దరూ హాయిగా, దగ్గరగా వేరే ఆలోచనలు లేకుండా, ఇష్టంగా గడిపి ఎన్నాళ్ళయిందో.

పెద్దచప్పుడు... కీచుమన్న ఆ ధ్వని కొత్తేంకాదు. రోడ్డుకి అటువైపుకారుకి సడన్‌గా పక్కరోడ్డులో నుంచి అడ్డంగా వచ్చేసిన మోటార్ సైకిల్. ఏ ప్రమాదం జరగలేదు, అదృష్టం... బ్రేకుల చప్పుడుతోటే ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు.

ఇక్కడా, అక్కడా అన్న భేదం లేదు. సాయంత్రం అయితేచాలు అన్ని రోడ్లూ రద్దీనే. ట్రాఫిక్‌జామ్. అందరికీ కంగారే. ఎవరికీ దృష్టి సరిగ్గా కుదరటం లేదు. అందరూ ఎటో చూస్తూ... మరేదో చేస్తూ... ఏవేవో ఆలోచనల్లో వున్నట్టు... కూర్చున్నా, లేచినా, బళ్ళు నడుపుతున్నా బెదిరిన చూపుల్తో, ఒకటికి పది తాపత్రయాలు... స్థిరంగా నిలవని ఆలోచనలు.

ఆటో స్టాండ్‌లోనే ఆగి, బేరంకోసం చూసే పద్ధతి లేదు. దిక్కులు చూస్తూ, వెతుకుతూ తిరిగితేనే, పోటీపడితేనే ఎక్కువ సంపాదన.

అయినా తిరుగుడు ఆపి, కాస్సేపు పక్కనే ఆగాలనిపించింది రాముకి. రోడ్డుకి పక్కగా వచ్చి ఆగాడు. చుట్టూ బేరాలకోసం చూస్తూనేవున్నాడు.

అలా చూస్తున్నప్పుడే కనపడింది... ఎఱ్రచీర. కొద్ది దూరంలో వెలుగూ, చీకటి కానట్టు నిలబడివుంది. ఆమె ముఖం ఓ పక్కే కనిపిస్తోంది .పోల్చుకోవటం పెద్ద కష్టమేమీ కాదు.

అలాంటి స్థితిలో చాలామంది ఆడాళ్ళని, చాలా చోట్ల, చాలాసార్లు చూశాడతను.

కొందరు తమతో వ్యాపారంలో కలవమని, అలసటలేకుండా సంపాదన బావుంటుందని ఒత్తిడి చేశారు. గతిలేని వీధి వ్యభిచారం.

ఆటోలో వాళ్ళని ఎక్కించుకుని, ఇలాగే చీకటి, వెలుగుల్లో తిప్పాలి. సంపాదన బాగానే వుంటుంది. కొంతమంది ఆటోవాళ్ళు చేసేపనే. కానీ ఎందుకో ఎప్పుడూ అలా చెయ్యాలని అనిపించలేదు. ఎక్కువ సంపాదన, అదనపు సరదా, అడ్డదారి... అయినా రాముకి నచ్చలేదు.

చూపు తిప్పుకున్నాడు రాము.

తను నమ్ముకున్నది ఒక్కటే. రాత్రింబగళ్ళు కష్టపడటం, జాగ్రత్తగా, పొదుపుగా బతకటం...

హైద్రాబాద్ వచ్చి పదిహేనేళ్ళయింది. ఎన్నో రకాలుగా నిలదొక్కుకోవటానికి ప్రయత్నించాడు. పొట్ట కూటికోసం ఎన్నో ఉద్యోగాలు చేశాడు.

నెలకి పదిహేనువందల నుంచి రెండు వేలవరకు జీతాలు. పన్నెండు, పధ్నాలుగ్గంటల పని... పైగా ఏ నెల ఉద్యోగం ఉంటుందో, ఉండదోనన్న బెంగ.

ఉద్యోగానికి తోడు మరికొంచెం సంపాదన వుంటుందని మొదలుపెట్టిన ఆటో, ఉద్యోగంమానేసి పూర్తిగా ఆటోనడపటం బాగానే వుందనిపించింది. ఉద్యోగంకన్నా కొంచెం సంపాదనా మెరుగ్గానే వుంది.

రాత్రి పన్నెండు వరకు ఆటోని నడుపుతాడు. పొద్దున్నే రైల్వేస్టేషన్‌కి వెడతాడు. శ్రమ ఎక్కువే. విశ్రాంతి తక్కువ. ఇంట్లో ఉండే సమయం తక్కువ.

తను పుట్టి పెరిగిన ఊరు, హైస్కూలు చదువు, పెళ్ళి, ఇద్దరు పిల్లలు పుట్టటం అమ్మాయి పెళ్ళి చెయ్యగలగటం, నగరానికి మకాం మార్చటం, ఇలా తన నలభై అయిదేళ్ళ జీవితంలో చాలా విషయాలు, చాలాసార్లు ముక్కలు ముక్కలుగా గుర్తొస్తాయి.

కానీ ఇప్పుడు అన్నిటికన్నా ఎక్కువగా ఆలోచనలో మెదిలేది... ఆటో... ఫైనాన్స్‌మీద

తీసుకోవటం. అది కాక దానికి ముందు కట్టిన డబ్బు... రోజూ కట్టాల్సిన వాయిదా... రెండు మూడు రోజులు కట్టలేకపోతే ఫైనాన్సర్‌కి కట్టాల్సిన అదనపు వడ్డీ.

పేవ్‌మెంట్ మీద నిలబడ్డ అమ్మాయి తనవేపే రావటం కనిపించింది రాముకి. ఆమెకోసమే ఆగాననుకుంటోందేమో... ఎందుకొచ్చిన గొడవ.

ఆటోస్టార్ట్‌చేసి ముందుకి కదిలాడు. ఈ సమయంలో, ఇంతసేపు బేరాల్లేకుండా వుండవు. నాలుగు ఎక్కువబేరాలు దొరకాలి. మరింత సంపాదన అవసరం వుంది అనుకున్నాడు.

అవసరాలు ఆలోచనలో కదులుతున్నాయి. ఈ మధ్యే పెద్దమ్మాయికి పురుడుపోసి అత్తారింటికి పంపాడు. తొలికానుపు పుట్టింటివాళ్ళే పొయ్యాలన్న రివాజు. దరిదాపు పదినెలలు... ప్రతి నెలా ఏదో ఒక అదనపు ఖర్చు. ఛ.ఛ. బంగారుతల్లి... దాని పురుడుకి ఖర్చు అనుకోకూడదు.

ఇప్పుడిప్పుడే మళ్ళీ నెలసరి బడ్జెట్ కొంచెం అర్థమయ్యే స్థితికి వస్తోంది. జాగ్రత్తపడి కట్టిన చిట్‌వల్ల వచ్చిన డబ్బేకాక, పురిటికి అప్పు అదనంగా చాలా అయింది. అయినా ఫరవాలేదు. కష్టపడతాడు. ఉన్న ఇబ్బందల్లా ఆటో ఫైనాన్సర్‌తోటే.

సంపాదించిందంతా తీసుకువెళ్ళి కట్టినా సరిపోవటం లేదు. ఏమిచేయాలో మరి.

"జూబ్లిహిల్స్ వెళ్ళాలి..."

"కూర్చోండి సార్..."

రాము ఆలోచనకి దూరానికి వెళ్ళే ఆ బేరం కొంత ఊరట ఇచ్చి ఉత్సాహపరిచింది.

×××

ఆటో నెమ్మదిగా, జాగ్రత్తగా నడపాలి. ఉన్న ఇబ్బందులకి తోడు, ఏ యాక్సిడెంటైనా అయితే... రాత్రి పన్నెండున్నరైంది.

అలసటగా వుంది. తొందరగా ఇల్లు చేరితే బావుంటుంది. అయినా ఆటో తొందరగా నడపకూడదు. ఇవ్వాళైనా కాస్సేపు భార్యతో కబుర్లు చెప్పుకోవాలి. అకస్మాత్తుగా పేవ్‌మెంట్ మీది ఎర్రచీర అమ్మాయి గుర్తొచ్చింది. తమ ఆటోల్లో అలాంటి ఆడవాళ్ళని తిప్పుతూ, వేళాకోళాలాడుతూ సరదాగా గడిపే తోటి ఆటోవాళ్ళు గుర్తొచ్చారు.

తనకన్నా అలాంటి తన ఆటో మిత్రుల జీవితాలు సరదాగా వుంటాయేమో... అయినా వద్దు. తనూ, భార్య, ఇద్దరు పిల్లలు, కొత్తగా పుట్టిన మనవరాలు... ఈ జీవితం తనకిచాలు.

డబ్బు ఇబ్బందులు తీరిపోయాక... ఆటో ఫైనాన్స్ తీరిపోయాక... ఇంకేం కావాలి... తన ఎనిమిదేళ్ళ బాబు జీవితాన్ని మంచి చదువుతో పెంచగలిగితే, అంతా బాగానే

వుంటుంది. ఇంట్లో ఏం చేస్తున్నారో... బాబు నిద్రపోయేవుంటాడు. భార్య కలతనిద్రతో ఎదురుచూస్తోందేమో.

అకస్మాత్తుగా ఎడంచేతివైపు సందులోంచి, చీకటి దెయ్యంలా పెద్దలారీ వచ్చింది... గబుక్కున బ్రేక్ వేశాడు రాము. రాత్రే కదా... ట్రాఫిక్ లేదు కదా అనుకోకూడదు. ఎంత ప్రమాదం... జాగ్రత్తగా వుండాలి.

ఆటో ఇంటిముందు పెట్టి, తాళంవేసి, తలుపు తట్టేలోపే రాము భార్య తలుపు తీసింది.

"ఇంకా నిద్రపోలే..." అని అడిగాడు.

"ఉహూ" అటూ తల అడ్డంగా ఊపింది లక్ష్మి. మంచినీళ్ళిచ్చింది. తాగాడు రాము.

పిచ్చిది... ఇంకా నిద్రపోకుండా తనకోసం ఎదురుచూస్తోంది. ఇవాళైనా కాస్సేపు...

"బాబుకి జ్వరం తగిలింది. నాన్న కావాలని ఏడ్చి ఇప్పుడిప్పుడే నిద్రపోయాడు"

"అయ్యో... జ్వరం వచ్చిందా" మంచం దగ్గరకెళ్ళి బాబుని చూశాడు రాము. పిల్లాడి ముఖం బాగా ఏడ్చినట్టు ఎర్రబడింది. కొంచెం ఆయాసపడుతున్నాడు. ఒళ్ళు బాగా వేడిగా వుంది.

ఆ రాత్రంతా లక్ష్మికి, రాముకి సరైన నిద్రలేదు. తెల్లవార్లూ పిల్లాడు మూలుగుతూనేవున్నాడు. తెల్లారాక వీధి చివర్న వుండే డాక్టరు దగ్గరకెళ్ళి, వరుసలో రెండు గంటలు కూర్చున్నాక వీళ్ళ వంతు వచ్చింది. డాక్టరు మందులిచ్చాడు. అవి వాడాక సాయంత్రం మళ్ళీ రమ్మన్నాడు.

సాయంత్రమే కాదు, ఆ మర్నాడు మళ్ళీ వెళ్ళారు. జ్వరం రెండు గంటలు తగ్గుతోంది, మళ్ళీ వస్తోంది. డాక్టరుగారు మందులు మార్చారు. సాయంత్రందాకా చూశారు. పిల్లాడికి ఆయాసంతో ఇబ్బంది పెరుగుతోంది.

ఏం చెయ్యాలి. రెండో రాత్రి మరింత కష్టంగా గడుస్తోంది. కొంచెం భయంకూడా వేస్తోంది. తేలిగ్గా తగ్గే జ్వరంలా కనిపించటం లేదు.

ఆ రెండురోజులు ఆటో తిప్పాలన్న ఆలోచనకే ఆస్కారం లేదు. చేతిలో డబ్బంతా అయిపోయింది. ఓ పక్క పిల్లాడికి ఇలా అయిందే అన్నబాధ... మరో వైపు డబ్బు లేదన్న ఆందోళన.

పిల్లాడికేమైనా అయితే... అమ్మో... తన ఆశలన్నీ తన ముందు జీవితమంతా వాడే, ఏం జరగదు. మామూలు జ్వరమే... కొంచెం ఎక్కువగా వచ్చింది అంతే. ఊళ్ళో చాలామందికి జ్వరాలే. బాబుకీ అంతే... రేపోమాపో తగ్గిపోతుంది.

మూడోరోజు చాలా కంగారుగా, దిగులుగా, భయంగా వెళ్ళారు డాక్టరు దగ్గరికి.

"బాబుకి 105 వుంది జ్వరం. ఎటువంటి జ్వరమో పరీక్షలు చెయ్యాలి. నేను రాసిస్తున్నాను... విద్యానగర్‌లో పిల్లల హాస్పిటల్... చాలా బాగా చూస్తారు. వెంటనే తీసుకెళ్ళి జాయిన్ చెయ్యండి. అక్కడైతే అన్ని పరీక్షలకీ, తగిన వైద్యానికి సరిపడా సరంజామా అంతా వుంటుంది"

"ఎంతవుతుందండీ..." తన పరిస్థితి తలచుకుని భయంగానే అడిగాడు రాము డాక్టర్ని.

"ఎంతైతే ఏమిటయ్యా... పిల్లాడి ఆరోగ్యం, జ్వరం తగ్గటం మనకి ముఖ్యం కదా. ఎందుకైనా మంచిది నాలుగైదువేలు ముందు ఏర్పాటు చేసుకో..."

నిజమే... పిల్లాడు ముఖ్యం. వాడికి తగ్గటం ముఖ్యం. వాడికి బాధ తగ్గాలి. అది ముఖ్యం. కానీ ఇప్పుడు నాలుగువేలు... ఎలా వస్తాయి.

"డబ్బు ఇబ్బందిగా వుందండీ. పోనీ గవర్నమెంటు హాస్పటల్‌కి..." అన్నాడు రాము.

"నీ ఇష్టం... నీ వీలు... కానీ పిల్లాడి పరిస్థితిని బట్టి నేను చెప్పిన హాస్పిటల్ అయితే మంచిది. లేదూ అంటే గవర్నమెంట్ హాస్పటల్‌కే రిఫర్ చేస్తా. ఏ విషయం ఆలోచించుకుని చెప్పు"

లక్ష్మి ముఖంలోకి కూడా చూళ్ళేకపోయాడు రాము. పిల్లాణ్ణి చూస్తే ఏడుపొస్తోంది. రెండు రోజుల క్రితంవరకూ తుళ్ళుతూ, గెంతుతూ ఆడుకుంటూ గడిపిన పిల్లాడు... స్పృహ లేనట్టు ఆయాసపడుతూ నానా హైరానాపడుతున్నాడు.

డాక్టరు చెప్పిన విద్యానగర్ ప్రైవేట్ హాస్పటల్‌కే పిల్లాణ్ణి తీసుకెళ్ళాడు రాము. ఎడ్మిట్ చేసుకునేటప్పుడే రెండువేలు అడ్వాన్స్ కట్టించుకున్నారు. ఐ.సి.లో పెట్టారు. వైద్యం బాగానే జరుగుతోంది. కానీ ఏం జరుగుతోందో తెలియటంలేదు. చెప్పడం లేదు. చాలా రకాల పరీక్షలు చేశారు.

ఎప్పుడూ వడ్డీకి తెచ్చే మల్లయ్యదగ్గరే ఐదువేలు తెచ్చాడు రాము. హాస్పిటల్‌లో చేర్చిన రెండోరోజు రాత్రికే తెచ్చిన డబ్బులు అయిపోయాయి.

రాము అదే రాత్రి మళ్ళీ మరో ఐదువేలు మల్లయ్య దగ్గరే తీసుకున్నాడు. అంతంత డబ్బు ఖర్చు అవుతోందని తెలియనంత ఆందోళన, కంగారు... ఆ హాస్పిటల్‌నిండా రకరకాల పిల్లలు, తగ్గితే చాలన్న ఆరాటం... గండం గట్టెక్కాలన్న తపన. నిద్ర, తిండి, డబ్బు అన్నీ పిల్లాడి బాధ, ఆరోగ్యం తర్వాతే అనుకున్నాడు.

వందలలో సంపాదన... వేలలో ఖర్చు... అయినా పిల్లల హాస్పిటల్ ఇంత ఖరీదేమిటో.

మనసుండబట్టక పక్కనున్న వాళ్ళని కొందర్ని అదేమాట అడిగాడు రాము.

"ఇంకా నయం... పిల్లల హాస్పిటల్స్‌లో ఇక్కడే ఫీజులు తక్కువ..." అంటూ మిగిలిన హాస్పిటల్స్‌లో వసూలు చేస్తున్న ఫీజులు చెప్పారు.

పిల్లాడికి బాధ తగ్గింది. రకరకాల పరీక్షల్లో ఏమీ లేదు అని తేలింది. వైరల్ ఫీవర్ అన్నారు.

నాలుగురోజుల తర్వాత డిశ్చార్జ్ చేస్తూ... "అదృష్టం... డెంగ్యూ, గున్యాలాంటి వైరస్ కాదు. సరైన టైములో తీసుకువచ్చావు... జాగ్రత్తగా చూసుకోండి. ముఖ్యంగా దోమలు కుట్టకుండా చూసుకోవాలి..." అంటూ హాస్పిటల్‌వాళ్ళు పరిశుభ్రత గురించి, దోమల నివారణ గురించిన జాగ్రత్తలు చెప్పారు. పిల్లలకి బలం, రోగాలు తట్టుకునే శక్తి ముఖ్యం. మంచి ఆహారం పెట్టమన్నారు.

హాస్పిటల్ ఎమ్.డి. రాము ఆటో నడుపుతాడని తెలిసి... పేదవర్గంవాడని మొత్తం బిల్లులోంచి ఓ వెయ్యిరూపాయలు తగ్గించాడు.

ఇంటికి వెళ్ళాక ఓ వారం రోజులు ఇప్పించాల్సిన ఇంజెక్షన్‌ల గురించి, మందుల గురించి వివరాలు రాసిచ్చారు. ఏది ఎలా జరిగినా... పిల్లాణ్ణి క్షేమంగా ఇంటికి తెచ్చుకోగలిగినందుకు, డబ్బుకి ఏమాత్రం వెనకాడక సరైన టైములో, సరైన హాస్పిటల్‌కే తీసుకెళ్ళగలిగినందుకు ఆనందించారు.

ఆటో తీసిన ఆరోజే మళ్ళీ ఆలోచనలో అవసరాలు మెదిలాయి రాముకి. చాలా రకాలుగా ఆలోచించాడు. చాలా లెక్కలు వేసుకున్నాడు. ఫైనాన్స్ తీరితే, ఆటో సొంతమవుతుంది. అద్దె బాధ, వాయిదాల బాధలేకపోతే' ఆర్థికంగా బావుంటుంది అనుకున్న రాము ఆశ మొదటికి వచ్చింది.

ఫైనాన్స్ అతనికి ఆటో ఇచ్చేశాడు. అన్ని లెక్కలు పోను చేతికి వచ్చిన డబ్బుతో మల్లయ్య దగ్గర తెచ్చిన బాకీ కొంతే తీరింది. మళ్ళీ అద్దె ఆటో... వడ్డీ అప్పు... అయినా పిల్లాడు కోలుకుని క్షేమంగా స్కూలుకి వెళ్ళగలుగుతున్నాడన్న ఊరట.

జాగ్రత్తగా ఉండాలి. సరైన పద్ధతిలో, ఏ వ్యామోహాలకీ దగ్గరకాకుండా కష్టపడి బతకాలి. పొదుపుగా ఉండాలి. అనుకోని ఖర్చులు వస్తుంటాయి, డబ్బు ఆదా చెయ్యాలి. ప్రమాదాలు జరక్కుండా ఆలోచనల్ని అదుపుచేసుకోవాలి. ఆరోగ్యం కోసం, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యం కోసం, పరిసరాల్ని పరిశుభ్రంగా చూసుకోవాలి. అద్దె ఆటో సొంత ఆటో అంతబావుండలేదు... రాములో వద్దనుకున్నా రకరకాల ఆలోచనలు సాగుతూనే వున్నాయి.

పిల్లాణ్ణి చేర్చిన హాస్పిటల్ అస్తమానం గుర్తొస్తోంది. దోమలవల్ల రకరకాల జబ్బులు,

జాగ్రత్త అన్న విషయం మరీ గుర్తొస్తోంది.

ఎక్కడ దోమ కనపడినా వదలకుండా చంపటానికే ప్రయత్నిస్తున్నాడు రాము.

వీలున్నంతవరకూ నిత్యం అలా చంపుతూనే వున్నాడు. ఒక్క దోమని చంపినా, అది ఒక్క పసిప్రాణాన్ని కుట్టకుండా, రోగాలు రాకుండా కాపాడినా, నయమే కదా అనుకుంటున్నాడు.

దోమలు ఉండటం... వాటిని చంపటం అంతా తన చేతుల్లోనే వున్నట్టు.

ఎవరికి వారే జాగ్రత్తగా వుండాలి. ఎవరి ప్రతిభతో, ఎవరి పొదుపుతో వాళ్ళేపైకి రావాలి. ఆటో వాళ్ళకి, చిన్న మధ్యతరగతి ఆదాయాలకి, పేదవారికి తట్టుకోలేని, అనుకోని ఖర్చులు వస్తూనే వుంటాయి. తట్టుకోవటమే జీవితం మరి.

కాలుష్యం, మురికి వున్నాక దోమలు, రోగాలు కూడావుంటాయి. అన్నీ సబబే.మరి తన పదిహేనేళ్ళ శ్రమ... రాత్రనకా, పగలనకా, ఇంటిపట్టున సరిగా ఉండకుండా పడిన కష్టం... మళ్ళీ మొదటినుంచీ ఆరంభమూ... మళ్ళీ కోలుకోగలడా.

ఒక పిల్లాడి మామూలు జ్వరానికి పదివేల రూపాయలకు పైగా ఖర్చుకాకుండా... ఉన్న ఒక్క కూతురి తొలిచూలు పురిటికి అన్నీ అప్పులు కాకుండా... జీవితం వుంటే, ఎంత బావుండును.

రామూకి ఎందుకో తెలియకపోయినా కళ్ళమ్మట నీళ్ళొచ్చాయి. భార్య అక్కడలేదని తెలుసు. అయినా ఎక్కడ తను చూస్తే... తన కన్నీళ్ళ గురించి తెలిస్తే దిగులు పడుతుందేమో అన్నట్టు... వెర్రి మనిషిని బాధ పెట్టకూడదన్నట్టు... కన్నీళ్ళు కళ్ళల్లోనే ఇంకిపోయేలా చేసుకున్నాడు.

అద్దె ఆటో మరింత జాగ్రత్తగా నడపాలి... నడుపుతూనేవున్నాడు రాత్రీ పగలు.

రాము కంటి వెనక... మనసు లోలోపల తడిమాత్రం అలాగే వుంది. జీవితం జాగ్రత్తని మంచిని చెపుతూనేవుంది. తను వింటూనే వున్నాడు.

వేలకొద్దీవున్న మోసగాళ్ళతో, అవినీతితో చేరలేని లక్షలమందిలో ఒక్కడిగా, సామాన్యుడిలా బాధ్యతగా బతుకుతూనేవున్నాడు రాము.

– స్వాతి మాసపత్రిక – డిసెంబర్ 2007